

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శుక్రవారం | 02-10-2026 | సంపుటి: 3 | సంచిక: 238 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 02-10-2026 | VOLUME : 3 | ISSUE : 238 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట





- రెండు డీఏల విడుదలకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్!
- 235 మండలాల్లో కరువు పరిస్థితులు.. అఖిలపక్ష భేటీకి నిర్ణయం
- కొత్తగా 7,800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్య పెంపు..
- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్ , అక్టోబర్1: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ ( State Cabinet ) సమావేశం (కేబినెట్ భేటీ) అత్యంత కీలక నిర్ణయాలతో ముగిసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రెండు డీఏల విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ డిమాండ్, ధాన్యం కొనుగోళ్లు, నూతన ప్రాజెక్టులు తదితర పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి స్పష్టమైన విధివిధానాలను ఖరారు చేసింది.

ఉద్యోగులకు డీఏల ఊరట: 2024 నుంచి బకాయి ఉన్న డీఏల్లో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై ఏటా

మిగతా 2వ పేజీలో..



ఖైరతాబాద్ ఉప ఎన్నికకు
## తాత్కాలిక బ్రేక్

- విజయారెడ్డి పిటిషన్‌పై తుది తీర్పు వచ్చేవరకు నోటిఫికేషన్ ఇవ్వబోమన్న ఈసీఐ
- తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన భారత ఎన్నికల సంఘం
- దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం
- తదుపరి విచారణపై ఉప ఎన్నిక భవితవ్యం

3

## రీల్ చూసి నకిలీ నోట్లు.. చివరకు జైలుకు!

- ఇన్‌స్టాగ్రామ్ రీల్‌తో నకిలీ కరెన్సీ తయారీకి ప్లాన్
- టెలిగ్రామ్‌లో శిక్షణ తీసుకుని ఇంట్లోనే ప్రింటింగ్
- కూరగాయల వ్యాపారి కిషన్ సోలంకిని అరెస్ట్ చేసిన పోలీసులు

4

## 'క్యూర్'తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

- నేటి నుంచి అధికారికంగా అమల్లోకి 'క్యూర్' చట్టం
- 1955 జీహెచ్ఎంసీ యాక్ట్‌కు బదులుగా కొత్త చట్టం
- జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీలకు ఒకే పాలనా విధానం
- క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తిపన్ను లెక్కింపు

2

## అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్

- రేవంత్ కేవలం చంద్రబాబు పిల్లి!
- ఇద్దరి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి
- యూరియా లేక రైతుల గోస
- ఆరుగంటలు కూడా కరెంట్ రావడంలేదు
- అరిగోస పడుతున్న రైతులు
- కాళేశ్వరం, ఫార్ములా రేస్ లపై వేసిన కమిషన్లు ఏం తేల్చాయి?
- మూడేళ్లయినా ఆరుగ్యారంటీలు అమలు కాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## 24 గంటల కరెంట్ హామీ ఏమైంది..?

- మన రైతుల పంటలు ఎండుతుంటే.. రాజస్థాన్ కు విద్యుత్ అమ్ముకుంటారా..?
- కనీసం 7, 8 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది..
- లో వోల్టేజ్ తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయి..
- గత ప్రభుత్వ హయాంలో రోలింగ్ స్టాక్ ఉంటే..
- ఏడాదిలో 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ .
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజం
- 20 గంటల నాణ్యమైన విద్యుత్, పెండింగ్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్
- నంగునూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన

2





## మెట్రో.. ఆర్టీసీకి ఒకే పాస్!

- హైదరాబాద్ ప్రయాణికులకు ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ జాయింట్ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500
- ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- అప్‌గ్రేడ్ చేసిన 'మీ టికెట్' యాప్ రేపు ప్రారంభం

3

## హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు

- సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ
- జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు




2



## విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

- పాలేరు నియోజకవర్గానికి రూ.205కోట్ల నిధులు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

3

## రైతులందరికీ మద్దతు ధర అందేలా కేంద్రం చర్యలు చేపట్టాలి

- అధికారులు సమన్వయంతో పనిచేసి కరువు మండలాల ప్రతిపాదనలు అందించాలి
- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పంటలకు మద్దతు ధర
- పంటలన్నింటికీ మద్దతు ధరకు 100శాతం కేంద్రం కొనుగోలు చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2



## ఎస్ఐఆర్‌కు ఇదే తుది గడువు

- నవంబర్ 5 తర్వాత గడువు పొడిగించేది లేదన్న సీఈవో సుదర్శన్ రెడ్డి
- 92 లక్షల మందికి నోటీసులు.. 65 లక్షల మంది స్పందన
- 54 లక్షల మంది ఇప్పటికే తుది జాబితాలోకి
- ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి పత్రాలు తీసుకోనున్న బీఎల్‌వోలు
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ

2




# ఎస్ఐఆర్‌కు ఇదే తుది గడువు

హైదరాబాద్, అక్టోబర్ 1:

ఎస్ఐఆర్ ప్రక్రియకు నవంబర్ 5తో గడువు ముగుస్తుందని, ఆ తర్వాత మరోసారి పొడిగించే అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒకసారి గడువు పెంచినందున ఇక పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారమే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

**92 లక్షల మందికి నోటీసులు**

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్‌లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వగా.. 65 లక్షల మంది ఇప్పటివరకు స్పందించారని సీఈవో తెలిపారు. వీరిలో 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి చేర్చినట్లు వెల్లడించారు. నవంబర్ 5లోగా మిగిలిన అర్హులైన ఓటర్లను కూడా తుది జాబితాలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

**ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు**

ఇకపై హియరింగ్‌కు బదులుగా అవసరమైన పత్రాల సేకరణపైనే దృష్టి పెడతామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి పత్రాలు తీసుకుంటారని చెప్పారు. ఓటర్లను ఒకచోటకు పిలిపించకుండా నివాసాల వద్దే వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యులందరూ హాజరు కావాల్సిన అవసరం లేదని.. ఒకరు మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు అందిస్తే సరిపోతుందని చెప్పారు. వలస వెళ్లిన ఓటర్లను పిలవాల్సిన అవసరం లేదని, ఈఆర్ఓ ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు.

**నవంబర్ 9న తుది జాబితా**

తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందున ఫారం6కు డిక్లరేషన్ తప్పనిసరి అని సీఈవో స్పష్టం చేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అక్టోబర్ 7 వరకు గడువు ఉందన్నారు. నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారం నవంబర్ 5 వరకు కొనసాగుతుందని.. నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.

**ఖైరతాబాద్‌లో 40 శాతం పూర్తి**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు జారీ చేశామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్నవారిలో 40 శాతం మందిని ఇప్పటికే తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

మొదటిపేజీ తరువాయి

రూ.2500 కోట్ల భారం పడనుంది.

కరువు పరిస్థితులు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసిందని, రాష్ట్రంలో దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కేబినెట్ చర్చించింది. కరువు పరిస్థితులపై చర్చించేందుకు త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రానికి తగిన సాయం కోరేందుకు త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.

**కొత్త విద్యుత్ ప్రాజెక్టులు**

ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ గరిష్ట డిమాండ్ రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్లకు చేరినట్లు కేబినెట్ గుర్తించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ , 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.

**మరిన్ని కీలక నిర్ణయాలు:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, ప్రయోజనం లేని 10 అసంపూర్తి ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో డిజిటల్ మీడియా సంస్థలకు ప్రత్యేక అడ్వర్టైజింగ్ పాలసీని తీసుకురానున్నారు.

దిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుతో పాటు, సమన్వయం కోసం నలుగురు గ్రూప్1 అధికారులను నియమించనున్నారు.

# హైదరాబాద్ పోలీస్ పరిధిలో భారీ మార్పులు

- **సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాల సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ**
- **జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు**
- **ఆర్‌జీఐఏ పీఎస్ పేరు 'శంషాబాద్ పీఎస్'గా మార్పు**
- **ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్‌ల పరిధులకూ కొత్త రూపం**

హైదరాబాద్, అక్టోబర్ 1:

హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు పోలీస్ వ్యవస్థను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. సిటీ పోలీస్ పరిధిలోని జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లో మార్పులు చేస్తూ హోంశాఖ జీవో ఎంఎస్ నంబర్ 84ను జారీ చేసింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ పరిపాలనను సరళీకరించడం, శాంతిభద్రతల పర్యవేక్షణను మెరుగుపరచడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**76 ప్రాంతాల పరిధుల్లో మార్పులు**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగరంలోని 76 ప్రాంతాలకు సంబంధించిన పోలీస్ పరిధుల్లో మార్పులు చేశారు. పలు ప్రాంతాలను ప్రస్తుతం ఉన్న జోన్లు, డివిజన్ల నుంచి ఇతర పరిధులకు బదిలీ చేశారు. సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదిలీ చేయడంతో పాటు మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు చేశారు. శంషాబాద్ డివిజన్‌లోని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పేరును 'శంషాబాద్ పీఎస్'గా మార్చారు. రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్‌తో పాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల పోలీస్ సరిహద్దుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి.

**ప్రత్యేక విభాగాలకూ కొత్త పరిధులు**

లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లతో పాటు ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, జోనల్ సైబర్ సెల్ విభాగాల పరిధులను కూడా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేలా జోన్లు, డివిజన్లను కొత్తగా వర్గీకరించారు. మహిళల భద్రతకు సంబంధించిన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు కొత్త జోన్లను కేటాయించారు. సైబర్ నేరాల కేసుల్లో వేగంగా స్పందించేలా జోనల్ సైబర్ సెల్‌ల పరిధులను కూడా సవరించారు. తాజా మార్పులతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్

హైదరాబాద్, అక్టబోర్ 1:

తెలంగాణలో రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) అన్నారు.ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం నాడు తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలు గోస పడుతున్నారని తెలిపారు. ఆరు గంటలు కూడా కరెంట్ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, రైతుబంధు రావడం లేదని, యూరియా దొరకడం లేదని కంటతడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఫోన్ చేస్తే యూరియా పొలం వద్దకే వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.

**సిటీగైడ్స్ చూడండి**

ప్రజలు తమ పక్షాన నిలబడి ఈ ప్రభుత్వంపై పోరాడాలని కోరుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆనాడే చెప్పారు.. మోసపోకండి.. మోసపోతే గోసపడ్తం అని. ఇవాళ అన్నివర్గాల ప్రజలు గోసపడుతున్నరు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ రైతులను ఇబ్బంది పెట్టిందని, అదే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి "వెనకటి రోజులు మళ్లీ తెస్తా" అని చెప్పారని, ఇప్పుడు సాగునీరు లేని రోజులు, కరెంట్ రాని రోజులు తిరిగి తెచ్చారని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు మోసం చేసేవాళ్లనే నమ్ముతారని రేవంత్ రెడ్డి గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు నిజమయ్యాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిందని అన్నారు. కాళేశ్వరం మీద కమిషన్ వేశారని, విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ వేశారని, ఫార్ములాఈ వ్యవహారంపై కేసులు పెట్టారని, బ్యాంకు ఖాతాల వ్యవహారాలపై విచారణ జరిపారని, అయితే వీటి నుంచి ఏమి తేల్చారని ప్రశ్నించారు. ప్రజల మనసు ఖాళీగా ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలు గుర్తుకొస్తాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త అంశాలను తెరపైకి తెస్తోందని ఆరోపించారు.

సిరిసిల్ల పర్యటనలో ముఖ్యమంత్రి చేనేత కార్మికుల సమస్యలపై సమాధానం చెప్పకుండా వెళ్లారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లలో పలువురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, విద్యార్థుల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు నిలిచిపోయాయని, నేతన్న బీమా పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు పరిహారం ప్రకటిస్తారని, నేతన్న బీమాపై ప్రకటన చేస్తారని ఆశించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనను జరిపిన తీరుపై కేటీఆర్ ఫైర్ అయ్యారు.. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి పర్యటించడం ప్రజల మధ్య పర్యటనలా లేదని విమర్శించారు. "నల్లమల పులి అని చెప్పుకుంటడు.. నాలుగు వేల మంది పోలీసులను పెట్టుకుని పోతాడా? నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు పిల్లి" అని విమర్శించారు. ముఖ్యమంత్రి చుట్టూ పోలీసులు తప్ప ప్రజలు కనిపించలేదని, బీఆర్ఎస్ నాయకులను ముందుగానే అరెస్టు చేసి, దుకాణాలు మూసివేయించారని ఆరోపించారు.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన వ్యాపారాలు, టెండర్లు, భూముల వ్యవహారాలపై కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి అర్హత లేకపోయినా భారీ విలువైన టెండర్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు.కొండల్ రెడ్డి అర్హతలు, ఏరోస్పేస్ రంగంలో ఆయనకు వచ్చిన అవకాశాలపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు పెద్దగా ఆస్తులు లేని కుటుంబ సభ్యులు వేల కోట్ల పెట్టుబడులు ఎలా పెడుతున్నారని ప్రశ్నించినందుకే ముఖ్యమంత్రికి కోపం వస్తోందని అన్నారు.

తన ఆస్తులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేసీఆర్ 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రి, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రిగా పనిచేశారని, నాలుగు దశాబ్దాలకు పైగా చట్టసభల్లో ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ తనను చిన్నప్పటి నుంచి బాగా చదువుకోవాలని చెప్పేవారని, తాను చదువుకుని అమెరికాలో ఆరు సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. 2006లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలో హోటల్ ప్రారంభించానని, 2009 ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు, వ్యాపార వివరాలను స్పష్టంగా వెల్లడించానని తెలిపారు. "నేను అఫిడవిట్‌లో చెప్పిన విషయాన్నే మళ్లీ కొలంబస్ కనుగొన్నట్టు చెబుతున్నరు" అని కేటీఆర్ అన్నారు. వ్యాపారం చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు.తన ఆస్తులపై, రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ సవాల్ చేశారు. "మా తాతల ఆస్తుల నుంచి మీ తాతల ఆస్తుల వరకు విచారణ చేయండి అని సవాలు విసిరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. మూడు నెలల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మూడేళ్లు గడిచినా ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు. దళితబంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారని, బీసీలకు రూ. లక్ష కోట్లు ఇస్తామని చెప్పి ఎంత నిధులు కేటాయించారని నిలదీశారు. బీసీలకు కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారని, రాష్ట్రంలో కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయని ప్రశ్నించారు. మైనారిటీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఎస్సీ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్‌ల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, రైతుబీమా, మిషన్ భగీరథ వంటి పథకాలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ హామీలు ఏమయ్యాయి?**

కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్, ప్రతి ఇంటికి నల్లా, ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వంటి హామీల పరిస్థితి ఏమిటని నిలదీశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తెలంగాణ పాటలు, కేసీఆర్‌కు సంబంధించిన పాటలు ప్రజలు గుర్తు గుర్తు చేసుకుంటున్నారు అని కేటీఆర్ అన్నారు. "అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే తెలుస్తది" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు.

# రైతులందరికీ మద్దతు ధర అందేలా కేంద్రం చర్యలు చేపట్టాలి

హైదరాబాద్, అక్టోబర్ 1 :

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారుల సమన్వయంతో మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలకు ఆ శాఖ సేకరించిన సమాచారాన్ని వారికి అందజేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్ర వ్యవసాయ శాఖ రూపొందించిన కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం కేవలం వర్షపాతం లోటును మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, వర్షపాతం వ్యత్యాసం, ఎస్పీఐ, పొడి కాలం, విత్తిన విస్తీర్ణం, ఎన్డీవీఐ/ఎన్డీడబ్ల్యూఐ, విసిఐ, నేల తేమ, రిజర్వాయర్ నిల్వలు, భూగర్భజల పరిస్థితులు, ప్రవాహ జలాలు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి, వలసలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీనికి వ్యవసాయశాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను వారికి ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

కరువు తీవ్రతను బహుళ సూచికల ఆధారంగా అంచనా వేసి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలనతో పంట నష్టాన్ని నిర్ధారించాలన్నారు. కరువు నిర్వహణ మార్గదర్శకాల ప్రకారం సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం ఉంటే లోటు వర్షపాతంగా, 60 నుంచి 99 శాతం ఉంటే భారీ లోటుగా, వర్షం పూర్తిగా లేకపోతే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణించాలని, అదే విధంగా, సాగు విస్తీర్ణం సాధారణంతో పోలిస్తే 85 శాతం కంటే తక్కువగా ఉండటం కరువు పరిస్థితికి, 75 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉండటం తీవ్రమైన కరువు పరిస్థితికి సూచికగా పరిగణించాలని మంత్రి తెలిపారు.

**మద్దతు ధర ప్రకటించిన పంటను 100 శాతం కొనుగోలు చేయాలి ...**

మద్దతు ధర (support price) ప్రకటించడంతో కేంద్రం బాధ్యత అయిపోందని, ఆ మద్దతు ధర ప్రతి రైతుకు అందేలా చూడటం కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క బాధ్యతే అని మంత్రి తుమ్మల అన్నారు. బుధవారం కేంద్ర కేబినెట్ రబీ మార్కెటింగ్ సీజన్ 202728కు సంబంధించి కనీస మద్దతు ధరలను పెంచింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పిఎస్ఎస్ లో ఆయా రాష్ట్రాలలో సాగవుతున్న పప్పుధాన్యాలు, నూనెగింజల మొత్తం ఉత్పత్తిలో నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే సేకరిస్తుందని, అలా కాకుండా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు.



ప్రకటించిన మద్దతు ధరకు 100 శాతం పంటల సేకరణ జరిగినప్పుడే రైతులకు కలుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండి రాహుల్ రాజ్ మరియు హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

# 24 గంటల కరెంట్ హామీ ఏమైంది..?

- **మన రైతుల పంటలు ఎండుతుంటే.. రాజస్థాన్ కు విద్యుత్ అమ్ముకుంటారా..?**
- **కనీసం 7, 8 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది..**
- **లో వోల్టేజ్ తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయి..**
- **గత ప్రభుత్వ హయాంలో రోలింగ్ స్టాక్ ఉంటే..**
- **ఏడాదిలో 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ .**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ధ్వజం**
- **20 గంటల నాణ్యమైన విద్యుత్, పెండింగ్ కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్**
- **నంగునూరు మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన**

హైదరాబాద్, అక్టోబర్ 1 :

మన రాష్ట్రంలో రైతులకు కరెంట్ సక్రమంగా లేక పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాజస్థాన్‌కు సింగరేణి విద్యుత్ అమ్ముకుంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన నంగునూరు మండలంలోని పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో పర్యటించారు. అనంతరం నర్మెట సబ్ స్టేషన్ ను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై మీడియాతో మాట్లాడారు.. పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాలలో రైతులను నేరుగా కలిసిన సమయంలో ప్రతీ రైతు విద్యుత్ లో వోల్టేజ్తో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఈ పరిస్థితిని తెలుసుకునేందుకు సంబంధిత నర్మెట సబ్ స్టేషన్ కు వెళ్లి పరిశీలించగా ఏ రోజూ రైతులకు 10 గంటల కరెంటు రావడం లేదని, కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా వస్తున్నట్లు తెలిసిందన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో 22 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తుంటే గగ్గోలు పెట్టి విమర్శ చేసిన కాంగ్రెస్ వాళ్లు నేడు అందులో సగం గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. అంక్షాపూర్ లో ఓ యువ రైతు తన ఎనిమిది ఎకరాల పొలం కరెంటు లేక ఎండిపోతోందని తన గోడును వెళ్లబుచ్చాడన్నారు. పాలమాకులలో మూడు రోజుల క్రితం ట్రాన్స్ ఫార్మర్ కాలిపోతే ఇప్పటికీ ఇవ్వలేదు, కరెంటు లేక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా నంగునూరులో 3, గట్లమల్యాలలో 2 ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి మూడు రోజులైనా కొత్తవి ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక్క మండలంలోనే వారంలో 41 ట్రాన్స్ ఫార్మర్లు, 100 నుంచి 200 మోటార్లు కాలిపోయినట్లు రైతులు తెలిపారని అన్నారు. దానికి కారణం ఏమిటని తెలుసుకోగా సబ్ స్టేషన్లో లోవోల్టేజీ సమస్య గుర్తించామన్నారు. ఈ నాసిరకం లో వోల్టేజ్ కరెంటు వల్లే రైతుల మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడం వల్ల రైతులకు దనపు భారం, ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇది పూర్తిగా చేతగాని ప్రభుత్వం, ఈ ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ఎందుకు దీనిపై రివ్యూ చేయడం లేదని ప్రశ్నించారు.



మన రాష్ట్రంలో కరెంటు లేదు కానీ.. సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు అమ్ముతామని జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకున్నారు అని ప్రశ్నించారు. మీరు చెప్పిందేమో 24 గంటల కరెంటు, కానీ ఇస్తున్నది కేవలం తొమ్మిది గంటలే. అందులోనూ మధ్యమధ్యలో ట్రిప్ అవుతోంది. మెటీరియల్ లేదనే సాకుతో రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సంవత్సర కాలంగా పెండింగ్ లో పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ నెల కనెక్షన్లు ఆ నెలకే రిలీజ్ చేసేవాళ్లం. అప్పుడు 4,500 రూపాయలు ఉన్న డీడీ చార్జీలను ఈ కాంగ్రెస్ వాళ్లు 9,000 రూపాయలకు పెంచారు. అయినా డీడీలు కట్టిన రైతులకు కనెక్షన్లు ఇవ్వకుండా ఎదురుచూపులు చూసేలా చేస్తున్నారు. మూడు రోజులు ట్రాన్స్ ఫార్మర్ లేకపోతే రైతుల పంటలు ఏమవ్వాలి? మీ ఇంటెలిజెన్స్ కు ఇవేవీ కనబడటం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గాలిలో తిరిగితే రైతుల సమస్యలు ఎట్లా తెలుస్తాయి.. నేల మీదకు వచ్చి రైతుల దగ్గరకు వస్తే వాస్తవాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండి నీరు కిందికి జారడం లేదు. కాబట్టి లోవోల్టేజ్ లేకుండా రాత్రి పూట కలుపుకుని కనీసం 20 గంటల కరెంటును రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అప్పట్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కరెంటు రెండు గంటలు తగ్గితే.. లాగ్ బుక్కుల కోసం సబ్ స్టేషన్ల చుట్టూ ఉరికి ఉరికి తిరిగారు. ఇప్పుడు ఎనిమిది గంటలే వస్తుంటే ఎందుకు తిరగడం లేదు? ఆయన ఇప్పుడు కూడా లాగ్ బుక్కుల కోసం తిరగాలని అన్నారు. ఇప్పటికైనా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేసేది ఒకటే.. రైతులకు 20 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలి, ట్రాన్స్ ఫార్మర్లకు రోలింగ్ స్టాక్ పెట్టాలి, కాలిపోయిన వెంటనే కొత్తది ఇవ్వాలి, పెండింగ్ లో ఉన్న 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే విడుదల చేయాలి, అన్ని జిల్లాల్లోని స్టోర్లలో వ్యవసాయ విద్యుత్‌కు అవసరమైన ఎక్విప్ మెంట్‌ను ప్రభుత్వం స్టాక్ మెయింటైన్ చేయాలని అన్నారు.

# ‘క్యూర్’తో హైదరాబాద్ పాలనలో కొత్త శకం

- నేటి నుంచి అధికారికంగా అమల్లోకి ‘క్యూర్’ చట్టం
- 1955 జీహెచ్ఎంసీ యాక్ట్‌కు బదులుగా కొత్త చట్టం
- జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీలకు ఒకే పాలనా విధానం
- క్యాపిటల్ వాల్యూ ఆధారంగా ఆస్తిపన్ను లెక్కింపు • ఆస్తి, నీరు, సీవరేజ్, శానిటేషన్ సేవలకు ఇంటిగ్రేటెడ్ బిల్లింగ్
- హైడ్రాకు చట్టబద్ధ హోదాతో ఆక్రమణలపై మరిన్ని అధికారాలు

హైదరాబాద్, అక్టోబర్ 1:




హైదరాబాద్ మహానగర పాలనలో కీలక మార్పులకు దారితీసే ‘క్యూర్’ (CURE) చట్టం రేపటి నుంచి అమల్లోకి రానుంది. 1955 నాటి జీహెచ్ఎంసీ యాక్ట్ స్థానంలో తీసుకొచ్చిన ఈ చట్టంతో జీహెచ్ఎంసీ, సీఎమ్‌సీ, ఎమ్ఎమ్‌సీ పరిధులకు సమగ్ర పాలనా విధానం అమలులోకి రానుంది. విలీన ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్నులు, పాలనా విధానాల్లోని వ్యత్యాసాలను తొలగించి మూడు కార్పొరేషన్లలోనూ ఒకే విధమైన నిబంధనలు అమలు చేయనున్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఏకీకృత విధానం అందుబాటులోకి రానుంది.

**క్యాపిటల్ వాల్యూపై ఆస్తిపన్ను**

క్యూర్ చట్టంతో ఆస్తిపన్ను విధానంలోనూ మార్పు రానుంది. ప్రస్తుతం ఉన్న రెంటల్ వాల్యూ విధానానికి బదులుగా ఆస్తి క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను లెక్కించనున్నారు. కొత్త విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనుండటంతో ఆస్తిపన్ను పెరిగే అవకాశం ఉంది. ప్రతి ఆస్తికి ప్రత్యేక ‘ఇంటిగ్రేటెడ్ ఐడెంటిటీ కోడ్’ కేటాయించనున్నారు. ఆస్తి పన్ను, తాగునీరు, సీవరేజ్, శానిటేషన్ చార్జీలను ఒకే పోర్టల్ ద్వారా సమగ్ర బిల్లింగ్ విధానంలో అందించనున్నారు. ట్రాఫిక్, విపత్తుల నిర్వహణ కోసం ప్రత్యేక అథారిటీల ఏర్పాటుకూ చట్టంలో మార్గం కల్పించారు.

**హైడ్రాకు చట్టబద్ధ హోదా**

చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా ఆస్తుల పరిరక్షణకు పని చేస్తున్న హైడ్రాకు క్యూర్ చట్టం ద్వారా చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. ఆక్రమణల నిరోధం, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాకు మరిన్ని చట్టపరమైన అధికారాలు అందనున్నాయి. దీంతో నగరంలోని పబ్లిక్ అసెట్స్ రక్షణలో హైడ్రా పాత్ర మరింత విస్తరించనుంది.

# విద్యుత్ రంగంలో మరింత అభివృద్ధి

ఖమ్మం, అక్టోబర్ 1 :

పాలేరు నియోజకవర్గం (Palair constituency)లో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు గత 34 నెలల్లో రూ. 205 కోట్ల నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తరుణి హాట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ తో కలిసి డివిజన్ ఈఆర్ఓ కార్యాలయాన్ని మంత్రి ప్రా రంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొం గు లేటి మాట్లాడుతూ.. పాలేరు నియోజక వర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, హైటెన్షన్ విద్యుత్ వైర్ల మార్పిడి, కొత్త విద్యుత్ లై న్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పా టు వంటి పనులకు రూ. 205 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. చేపట్టిన పనుల్లో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్ష నాయకులు విద్యుత్ రంగంపై తప్పుడు ప్రచారం చేస్తు న్నారని మంత్రి అన్నారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, తమ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిందని తెలి పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి అధిక వ్యయం జరిగిన అంశాలను సరిదిద్దుతూ విద్యుత్ రం గంలో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పా రు. తెలంగాణ విద్యుత్ రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భవిష్యత్ వి ద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఎన్ పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు, వి ద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీని వాస రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 20 వేల ఓట్లు వెంటనే చేర్చాలి: దానం నాగేందర్

- ఖైరతాబాద్‌లో ఓట్ల తొలగింపుపై మాజీ మంత్రి తీవ్ర ఆగ్రహం
- తొలగించిన ఓట్లను అదనపు జాబితాలో చేర్చాలని డిమాండ్
- బీజేపీతో కుమ్మక్కై ‘ఓట్ చోరీ’కి పాల్పడుతున్నారని ఆరోపణ
- బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఓటు హక్కు పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 1:

“ఖైరతాబాద్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఓట్లను అన్యాయంగా తొలగించారు.. వాటన్నింటినీ వెంటనే ఓటర్ల జాబితాలో చేర్చాలి” అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చకపోతే నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని హెచ్చరించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**బీజేపీతో కుమ్మక్కై ఓట్ చోరీ: దానం**

హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున ‘ఓట్ చోరీ’ జరుగుతోందని దానం నాగేందర్ ఆరోపించారు. ప్రజలను ఈ పరిణామాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కొంతమంది అధికారులు బీజేపీ నాయకులతో కుమ్మక్కై వారి ఆదేశాల మేరకు ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2000, 2002 నుంచి నివాసముంటూ, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్న నిజమైన ఓటర్ల పేర్లను ఇప్పుడు కావాలనే జాబితా నుంచి తొలగించారని అన్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

నిజమైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు



ప్రయత్నిస్తున్న అధికారులపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. అర్హులైన పౌరులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు తొలగించిన 20 వేల ఓట్లను అదనపు జాబితా ద్వారా తిరిగి చేర్చి ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు.



# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల చేయూత

హైదరాబాద్, అక్టోబరు 1:

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (Young India Police School) నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిజిపి సి.వి.ఆనంద్ అన్నారు. విద్య కోసం అందించే సహాయం సమాజంపై శాశ్వత ప్రభావం చూపుతుందని, దాని ప్రయోజనాలు భవిష్యత్ తరాలకు కూడా అందుతాయని పేర్కొన్నారు. మంచిరేవులలోని వైపీఎస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రెట్ (ఎంవైకే ఫౌండేషన్) రూ.2 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) లో భాగంగా ఈ విరాళాన్ని అందించింది. ఎంవైకే లాటిక్రెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం డిజిపి కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లక్ష్యమన్నారు. విద్యా సంస్థల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు, ఇతర భాగస్వాములు అందిస్తున్న సహకారం ప్రాజెక్టుకు మరింత బలాన్నిస్తుందని చెప్పారు. విద్యారంగానికి ఇచ్చే విరాళం, చేయూత ఎప్పటికీ విలువైనదేనని, సమాజ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని డిజిపి పేర్కొన్నారు.



# అక్టోబర్‌లోనూ ఎండలే!

- తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- ఈ నెలలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉండే సూచనలు
- ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- అక్టోబర్-డిసెంబర్‌లోనూ తక్కువ వర్షపాతమే ఉండొచ్చన్న ఐఎండీ
- ఈశాన్య రుతుపవనాల సమయంలో తటస్థ ఐఓడీ పరిస్థితులు కొనసాగే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 1:

తెలంగాణలో అక్టోబర్ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నెలవారీ వాతావరణ అంచనాలను విడుదల చేసిన ఐఎండీ.. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపింది. సాధారణంగా అక్టోబర్‌లో వాతావరణం క్రమంగా చల్లబడాల్సి ఉండగా, ఈసారి అందుకు భిన్నంగా ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని పేర్కొంది.

**ఎల్‌నినో ప్రభావం**

భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంపై కొనసాగుతున్న బలమైన ఎల్‌నినో పరిస్థితులు వాతావరణంపై ప్రభావం చూపుతున్నట్లు ఐఎండీ తెలిపింది. ఈ పరిస్థితులు ఏడాది చివరి వరకు మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం ఐఓడీ తటస్థ స్థితిలో ఉందని, రాబోయే ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేసింది.

**మూడు నెలలూ తక్కువ వర్షా లే?**

అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే సీజన్‌లో తెలంగాణలో మొత్తం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. దీంతో అక్టోబర్‌లోనూ వేడి వాతావరణం కొనసాగవచ్చని పేర్కొంది.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టీజీ టెట్–2026-II

- ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ
- అక్టోబర్ 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు అవకాశం
- గురుకులాలు, మోడల్ స్కూళ్ల టీచర్లకు కూడా అర్హత
- నవంబర్ 16 నుంచి 21 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 1:




తెలంగాణలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ శుభవార్త అందించింది. విధుల్లో ఉన్న టీచర్ల కోసం ప్రత్యేకంగా టీజీ టెట్-2026II నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పరిధిలోని బడులతో పాటు టీజీఆర్ఈఐఎస్, ప్రభుత్వ సంక్షేమ గురుకుల సొసైటీలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఈ ప్రత్యేక టెట్ రాసే అవకాశం కల్పించారు.

**అక్టోబర్ 7 నుంచి దరఖాస్తులు**

టీజీ టెట్-2026IIకి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 7న ప్రారంభం కానుంది. అర్హులైన ఉపాధ్యాయులు అక్టోబర్ 16 వరకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్షకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

**నవంబర్ 16 నుంచి పరీక్షలు**

దరఖాస్తు చేసుకున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నవంబర్ 16 నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో టెట్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. నిర్ణీత గడువులో అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

- విజయారెడ్డి పిటిషన్‌పై తుది తీర్పు వచ్చేవరకు నోటిఫికేషన్ ఇవ్వబోమన్న ఈసీఐ
- తెలంగాణ హైకోర్టుకు వెల్లడించిన భారత ఎన్నికల సంఘం
- దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం
- తదుపరి విచారణపై ఉప ఎన్నిక భవితవ్యం

హైదరాబాద్, అక్టోబర్ 1:

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై తుది పరిష్కారం లభించే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయబోమని తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణపై న్యాయస్థానం విచారణ పూర్తయ్యే వరకు అనిశ్చితి నెలకొంది.

**దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ**

బీఆర్ఎస్ తరపున గెలిచి, అనంతరం కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఖాళీ ఏర్పడిన ఆరు నెలల్లో ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ఈ వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించింది.

**విజయారెడ్డి పిటిషన్‌పై నిర్ణయం కీలకం**

గత అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది. ఈ పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకూడదని ఈసీఐ నిర్ణయించింది. ఈ విషయాన్ని న్యాయస్థానానికి వెల్లడించింది. తదుపరి విచారణలో హైకోర్టు వెలువరించే ఆదేశాల ఆధారంగా ఉప ఎన్నిక నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# మెట్రో.. ఆర్టీసీకి ఒకే పాస్!

- హైదరాబాద్ ప్రయాణికులకు ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ జాయింట్ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500
- ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం
- అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ యాప్ రేపు ప్రారంభం
- మొబైల్ నుంచే బస్ టికెట్లు, డే పాస్, వార, నెలవారీ పాస్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 1:

హైదరాబాద్ నగర ప్రజా రవాణాలో ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇక మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించే అవకాశం కల్పిస్తూ ‘కామన్ పాస్’ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ మొబైల్ యాప్‌తో ఈ సేవలను మరింత సులభతరం చేయనున్నారు. ఉమ్మడి పాస్ విధానాన్ని రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించనున్నారు.

**రూ.400 నుంచి జాయింట్ పాస్**

మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ రోజువారీ, నెలవారీ జాయింట్ పాస్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రోజువారీ పాస్ ధరను రూ.400గా, నెలవారీ పాస్‌ను రూ.8,500గా నిర్ణయించారు. ఈ పాస్ ఉన్న ప్రయాణికులు రెండు రవాణా వ్యవస్థల్లోనూ ప్రయాణించవచ్చు. ఉద్యోగులు, వ్యాపారులు, నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగించే వారికి ఈ విధానం ఉపయోగపడనుంది.



**మొబైల్‌లోనే టికెట్**

ఆర్టీసీ బస్సుల్లోనూ డిజిటల్ టికెటింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కండక్టర్ నుంచి పేపర్ టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రయాణికులు మొబైల్ ద్వారానే టికెట్ పొందే సదుపాయం కల్పించారు. అప్‌గ్రేడ్ చేసిన ‘మీ టికెట్’ యాప్‌లో రోజువారీ టికెట్లు, డే పాస్‌లతో పాటు వారంరోజుల పాస్, నెలవారీ బస్ పాస్‌లను కూడా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. నగర ప్రజా రవాణాను మరింత వేగవంతంగా, సులభతరం చేసే దిశగా ఈ డిజిటల్ సేవలను తీసుకొచ్చారు.



# దివేగర్ బీచ్‌లో విషాదం..

- 8 మంది విద్యార్థులు మృతి
- పుణే నుంచి విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులకు తీవ్ర విషాదం
- సముద్రంలో ఈతకు దిగి గల్లంతైన 8 మంది
- మృతులంతా 16 ఏళ్ల వయసువారే • బలమైన అలలు, సముద్ర ప్రవాహమే ప్రమాదానికి కారణం
- ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి

**రాయ్‌గఢ్, అక్టోబర్ 1:**

మహారాష్ట్ర రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పుణేలోని అలందీకి చెందిన ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు విహారయాత్రలో భాగంగా సముద్రంలో ఈతకు దిగగా 8 మంది నీటిలో కొట్టుకుపోయి మృతిచెందారు. మృతులంతా 16 ఏళ్ల వయసువారని అధికారులు తెలిపారు.

**బలమైన అలలతో ప్రమాదం**

పుణేలోని విన్నర్ అకాడమీలో 11, 12 తరగతులకు కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు మొత్తం 48 మంది గురువారం విహారయాత్రకు వెళ్లారు. వారిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు ఉన్నారు. దివేగర్‌లోని దిఘి సాగరి ప్రాంతానికి చేరుకున్న విద్యార్థులు బీచ్‌లో ఈతకు దిగారు. అదే సమయంలో బలమైన అలలు, సముద్ర ప్రవాహం కారణంగా 8 మంది విద్యార్థులు కొట్టుకుపోయారు. విద్యార్థులు సముద్రంలోకి వెళ్లిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. కొంతసేపటి తర్వాత గల్లంతైన 8 మంది మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు.

**మృతుల్లో వీరు**

తన్మయ్ దత్తాత్రయ్ వహిలే, సుమిత్ భారత్ అహిరే, ప్రణవ్ రామ్‌దాస్ బన్సోడే, కైవల్య సతీశ్ వాసంకర్, రాజ్‌వీర్ యువరాజ్ వహిలే, యశ్ కిరణ్ వాంఖడే, సోహమ్ తుకారాం భాండ్వల్కర్, కౌస్తుభ్ సందీప్ దౌండ్ ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఘటనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.




# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

- ఈసీలో విభేదాలపై క్లారిటీ..
- 2025 ఫిబ్రవరి 19 నుంచి ఏ నిర్ణయంపైనా విభేదించలేదన్న ఈసీ వర్గాలు
- గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు గల్లంతు కావడానికి సాంకేతిక లోపమే కారణమని వివరణ
- సీఐఆర్‌పై రాజకీయ ఆరోపణల మధ్య దేశవ్యాప్తంగా నిరసనలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1:**

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయన్న వార్తల నేపథ్యంలో రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతున్న వేళ ఈసీ కీలక వివరణ ఇచ్చింది. 2025 ఫిబ్రవరి 19 నుంచి కమిషన్ తీసుకున్న ఏ నిర్ణయంపైనా ఏ ఎన్నికల కమిషనర్ విభేదించలేదని ఈసీ వర్గాలు గురువారం వెల్లడించాయి. ప్రతి నిర్ణయం "ఏకగ్రీవం"గానే తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ప్రధానంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సీఐఆర్)లో మరణించిన, నకిలీ, మోసపూరిత, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లను గుర్తించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో కొనసాగించడమే లక్ష్యమని స్పష్టం చేశాయి.

**14 అభ్యంతరాల కథనంతో కలకలం**

సీఐఆర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఈసీలు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అంగీకారంతోనే చర్యలు చేపట్టినట్లు ఈసీ వర్గాలు చెబుతున్నాయి. అయితే 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల ప్రచురించిన పరిశోధనాత్మక కథనంలో.. గత 10 నెలల్లో సంధు, జోషి కనీసం 14 సార్లు పలు నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, ఓటర్ల పునరుద్ధరణ, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆ కథనం పేర్కొంది.

అయితే ఈ కథనం వెలువడిన అనంతరం ఈసీ తన వైఖరిని స్పష్టం చేసింది. గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని పేర్కొంది. అదే సమయంలో కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం నిర్ణయ ప్రక్రియలో భాగమేనని ఈసీ వివరించింది.

**గోవా ఓట్లపై ఈసీ వివరణ**

గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో లేకపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. సీఐఆర్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగానే ఈ పేర్లు తుది జాబితాలో చేరలేదని తెలిపింది. ఇదే అంశంపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం కూడా గోవా ఈఆర్‌ఓలు అర్హులుగా గుర్తించిన 97 మంది పేర్లను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయలేకపోయిన విషయాన్ని ప్రస్తావించింది.

దేశవ్యాప్తంగా 25 వేల మంది ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు సీఐఆర్ ప్రక్రియలో పనిచేస్తున్నారని ఈసీ వర్గాలు తెలిపాయి. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలు కమిషనర్లు వ్యక్తిగతంగా నిర్వహించరని, క్షేత్రస్థాయిలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో వికేంద్రీకృతంగా జరుగుతాయని వివరించాయి.

**నిరసనలతో మరింత వేడెక్కిన రాజకీయం**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సీఐఆర్ పేరుతో బీజేపీకి అనుకూలంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సీఈసీపై చర్యలు కోరుతూ వివిధ ప్రాంతాల్లో నిరసనలు కూడా కొనసాగుతున్నాయి. మరోవైపు సీఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులోనూ సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండిస్తూ.. తన నిర్ణయ ప్రక్రియ ఏకగ్రీవంగానే సాగిందని చెబుతోంది. చట్టపరంగా కూడా ముగ్గురు సభ్యుల కమిషన్‌లో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లు సమాన హోదాలో ఉంటారు. 2023 చట్టంలోని నిబంధనల ప్రకారం సాధ్యమైనంతవరకు నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకోవాలి; భిన్నాభిప్రాయం ఉంటే మెజారిటీ అభిప్రాయం ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# రీల్ చూసి నకిలీ నోట్లు.. చివరకు జైలుకు!

- ఇన్‌స్టాగ్రామ్ రీల్‌తో నకిలీ కరెన్సీ తయారీకి ప్లాన్
- టెలిగ్రామ్‌లో శిక్షణ తీసుకుని ఇంట్లోనే ప్రింటింగ్
- కూరగాయల వ్యాపారి కిషన్ సోలంకిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.65,500 విలువైన నకిలీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం
- చిన్న కొనుగోళ్ల ద్వారా నకిలీ నోట్ల చలామణి

**రాజ్‌కోట్, అక్టోబర్ 1:**

ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన ఓ రీల్ ఓ కూరగాయల వ్యాపారిని నకిలీ కరెన్సీ తయారీకి పురిగొల్పింది. ఆ తర్వాత టెలిగ్రామ్ ద్వారా శిక్షణ తీసుకున్న అతడు ఇంట్లోనే నకిలీ రూ.100, రూ.500 నోట్లను ముద్రిస్తూ పోలీసులకు చిక్కాడు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. మాందడుంగర్ ప్రాంతానికి చెందిన కిషన్ సోలంకిని రాజ్‌కోట్ సిటీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ పోలీసులు అరెస్ట్ చేశారు.

**రీల్ నుంచి టెలిగ్రామ్ వరకు**

కూరగాయల వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం సరిపోక అప్పుల్లో కూరుకుపోయిన కిషన్.. నకిలీ నోట్లు తయారు చేసే విధానంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్ చూశాడు. ఆ రీల్‌కు సంబంధించిన వ్యక్తిని సంప్రదించగా.. టెలిగ్రామ్ ద్వారా నకిలీ కరెన్సీ తయారీపై శిక్షణ పొందాడు. అనంతరం ఇంట్లోనే నకిలీ నోట్ల ముద్రణ ప్రారంభించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

తాను తయారు చేసిన రూ.10 వేల విలువైన నకిలీ నోట్లను శిక్షణ ఇచ్చిన వ్యక్తికి ఇచ్చినట్లు, అందుకు ప్రతిగా రూ.3 వేలు చెల్లించినట్లు కిషన్ పోలీసులకు తెలిపాడు. శిక్షణ ఇచ్చిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



**చిన్న కొనుగోళ్లతో చలామణి**

కిషన్ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు సీపీయూ, మానిటర్, రెండు ప్రింటర్లు, లామినేటర్ హీటర్ మెషిన్, బటర్ పేపర్, రూ.100 డినామినేషన్ ముద్రించిన కాగితాలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ కరెన్సీతో కలిపి స్వాధీనం చేసుకున్న సామగ్రి విలువ రూ.65,500గా పోలీసులు అంచనా వేశారు.

నకిలీ నోట్లను బల్క్‌గా విక్రయించకుండా వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న కొనుగోళ్లు చేస్తూ స్వయంగా చలామణి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటివరకు ఎంత మొత్తంలో నోట్లు ముద్రించాడు, ఎక్కడెక్కడ చలామణి చేశాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసులో కిషన్ సోలంకికి కోర్టు మూడు రోజుల రిమాండ్ విధించింది.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే: అభిజిత్ దీప్కే

- అనుమతి లేకపోయినా అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో 'జైల్ భరో' నిర్వహిస్తాం
- "మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా జైలుకు వెళ్లేందుకు సిద్ధం"
- సీఈసీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్
- 2025 ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేసి ఎలాంటి మార్పులు చేయొద్దని కోరిన సీజేపీ
- అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు హెచ్చరిక

**ముంబై, అక్టోబర్ 1:**

"ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు మా ఆందోళన ఆగదు" అని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో నిరసనకు పోలీసుల అనుమతి లేకపోయినా వెనక్కి తగ్గబోమని చెప్పారు. 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించి దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయాలను పలు జాతీయ మీడియా సంస్థలు అక్టోబర్ 1న వెల్లడించాయి.

**"మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా"**

నిరసనకారులకు మూడు రోజుల పాటు బెయిల్ దొరకదని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలను దీప్కే ప్రస్తావించారు. ప్రభుత్వం తమను జైలులో ఉంచాలని భావించినా మూడు రోజులు కాదు.. మూడు నెలలైనా జైలు శిక్ష ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముంబై పోలీసులు ఢిల్లీ పోలీసులు కాదని, పరిస్థితిని వారు సమర్థంగా నిర్వహిస్తారన్న నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న ఆందోళన నిర్వహించేందుకు ముంబై పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం ఇప్పటికే వెల్లడైంది.

**సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలి**

జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో పాటు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అందులో పౌర సమాజానికి కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేసి, 2025 నాటి ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ జాబితాలో ఇకపై ఎలాంటి మార్పులు చేయొద్దని కోరారు.



**అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలో ఆందోళన**

తమ డిమాండ్లు నెరవేరకపోతే అక్టోబర్ నెలాఖరు నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపడతామని దీప్కే ప్రకటించారు. అక్టోబర్ 2న ముంబై నుంచి ప్రారంభమయ్యే నిరసనలను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తామని సీజేపీ ఇప్పటికే ప్రకటించింది.

# సివిల్ సర్వీసు లక్ష్యం ప్రజాసేవే: ప్రధాని మోదీ

- ప్రతి ఉద్యోగికి 'నాగరిక్ దేవోభవ' నినాదం కావాలి
- పేదల ఆవేదనను అర్థం చేసుకునే మనసు అవసరం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 01:**

దేశ ప్రజలకు సేవ చేయడమే సివిల్ సర్వీసు ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సిటిజన్ ఫస్ట్ అనే భావనతో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనిచేయాలని, 'నాగరిక్ దేవోభవ' అనే ఆలోచనను తమ విధుల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సివిల్ సర్వీసు వ్యవస్థ భవిష్యత్తు దిశపై పలు కీలక సూచనలు చేశారు. దేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని అధికారులు కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలని ప్రధాని అన్నారు. నగరాల విస్తరణ, మౌలిక సదుపాయాల అవసరాలు, పెరుగుతున్న జనాభా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత విధానాలను ప్రభుత్వ పాలనలో మరింతగా ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ సర్వీసు ఎంపిక విధానాన్ని కాలానుగుణంగా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు స్వీయ మూల్యాంకన విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం విధుల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆయన అన్నారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరికి సున్నితమైన దృక్పథం అవసరమని ప్రధాని చెప్పారు. సామాన్య ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకొని సేవా భావంతో పనిచేసే అధికారులు దేశాభివృద్ధికి బలమైన పునాది అవుతారని అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇవ్వాలంటే ఉద్యోగుల అంకితభావం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లోనూ అపారమైన సమయస్ఫూర్తి, సహనం ప్రదర్శించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం దేశ ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.



కెప్టెన్ స్మిత్ మచ్చర్ కుటుంబ సభ్యులతో తాను మాట్లాడినట్లు ప్రధాని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారని, త్వరగా కోలుకోవాలని దేశ ప్రజలంతా ప్రార్థించాలని కోరారు. దేశానికి కీర్తి తెచ్చిన స్మిత్ మచ్చర్ సేవలను ప్రతి భారతీయుడు గుర్తుంచుకోవాలని, ఆయనకు వందనం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.






# రక్షణ ఆర్థిక నిర్వహణలో సాంకేతికతకు పెద్దపీట

- ఎప్పటికప్పుడు ఆర్థిక సమీక్షలు అవసరం
- కృత్రిమ మేధ, యంత్ర అభ్యాస వినియోగం పెంచాలి
- నిర్ణయాలకు తక్షణ సమాచార వ్యవస్థలు కీలకం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 01:**

రక్షణ ఖాతాల విభాగం వార్షిక సమీక్షలకే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు ఆర్థిక పరిస్థితులను సమీక్షించే విధానాన్ని అవలంబించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. నిర్ణయాలు తీసుకునే ఉన్నతాధికారులకు కీలక సమాచారం సకాలంలో చేరేందుకు సమాచార నిర్వహణ వ్యవస్థల వివరాలను తక్షణంగా నవీకరించే విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన రక్షణ ఖాతాల విభాగం దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం, డిజిటల్ లావాదేవీ భద్రతా వ్యవస్థలు, సమాచార విశ్లేషణ వంటి సాంకేతిక సాధనాల వినియోగం ద్వారా పారదర్శకత, వేగం, భద్రతను పెంచవచ్చని పేర్కొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయం ప్రకారం ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం ప్రస్తుత కాలంలో అత్యంత అవసరమైంది. వివిధ విభాగాల నుంచి వచ్చే వివరాలు తక్షణం అందుబాటులో ఉండటం వల్ల విధానపరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం డిజిటల్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రక్షణ ఖాతాల విభాగం దేశ రక్షణ వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోందని మంత్రి పేర్కొన్నారు. సైనిక అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం, వ్యయ నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాల్లో ఈ విభాగం పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ఈ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ పారదర్శక ఆర్థిక వ్యవస్థలు దేశ భద్రతకు కూడా పరోక్షంగా బలం చేకూరుస్తాయని అన్నారు. డిజిటల్ సాంకేతికత ఆధారంగా సమాచార భద్రతను పెంచడం ద్వారా ఆర్థిక లావాదేవీలలో నమ్మకాన్ని పెంపొందించవచ్చని వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రక్షణ రంగ ఆర్థిక నిర్వహణను రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రక్షణ ఖాతాల విభాగం అధికారులు, రక్షణ శాఖ ప్రతినిధులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. రక్షణ రంగంలో ఆర్థిక నిర్వహణను మరింత ఆధునికీకరించి సమర్థవంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# గాంధీజీ వేషధారణలో సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్ చిన్నారులు

**ఘనంగా మహాత్ముడి జయంతి వేడుకలు**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్** : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ పాఠశాలలో గురువారం నాడు గాంధీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల బాల బాలికలు గాంధీ వేషధారణతో పిల్లల్ని, తల్లిదండ్రులను, చూపరులను అలరించారు. అనంతరం గాంధీజీ చిన్ననాటి నుంచి చివరి దశ వరకు అనుభవించిన విశేషాలను పిల్లలందరికీ వివరించారు. గాంధీజీ చిత్రపటానికి సెయింట్ జూడ్స్ ప్రిన్సిపల్ ఉషారాణి విద్యార్థిని విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 5వ ,6వ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశం, మహాత్మా గాంధీ జీవితానికి, వారసత్వానికి1 నివాళిగా నిలిచింది. గాంధీ జయంతి వేడుక సెయింట్ జూడ్స్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు విద్యార్థులలో విలువలను పెంపొందించడానికి, సామాజిక చైతన్యాన్ని ప్రోత్సహించడానికి పాఠశాల యొక్క అంకితభావానికి ఒక నిదర్శనంగా నిలిచింది. పాఠశాల బాలబాలికలు గాంధీజీ బాల్యం గురించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన అహింసాయుత ప్రతిఘటన గురించి ఆసక్తికరమైన విషయాలను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పంచుకున్నారు. విద్యార్థులు గాంధీజీ యొక్క మూడు కోతులైన – మీజారు( చెడును చూడవద్దు) కికజారు ( చెడును వినవద్దు ) ఇవజారు ( చెడును మాట్లాడవద్దు ) ప్రాముఖ్యతను వివరిస్తూ చెడు ఆలోచనలు, మాటలు చర్యలకు దూరంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గాంధీజీ తన సొంత బట్టలను నేయడానికి ఉపయోగించిన రత్నం ( చిరఖా) ప్రాముఖ్యత గురించి, తద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వదేశీ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన విషయం గురించి కూడా పిల్లలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గాంధీజీ యొక్క అహింస సత్యం సరళత అనే తత్వాలను ప్రదర్శించారు. ఈ విలువలను తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని వారి తమ తోటి విద్యార్థులను ప్రోత్సహించారు. గాంధీజీ సూత్రాలను అనుసరించి, మరింత సామరస్యపూర్వక, శాంతియుత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. గాంధీజీ బోధనలు కాలాతీతమైనవి సార్వత్రికమైనవి. భవిష్యత్ పౌరులుగా, విద్యార్థులు విలువలను అర్థం చేసుకొని వాటిని తమ జీవితంలో అనుసరించడం అత్యవసరం. శాంతి, సామరస్యం, సామాజిక బాధ్యత పట్ల మనకున్న నిబద్ధతను నేటి వేడుక గుర్తు చేస్తుంది అనే విధంగా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు
- బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేసి, పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్** : ఎస్ఐఆర్–2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఫారం-6 డిక్లరేషన్ తప్పనిసరి**

కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం–6, ఫారం–7 కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం–6, పెండింగ్ నోటీసులు, ఫారం–7, ఫారం–8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వాసు చంద్ర, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరెండెంట్ నెమత్ హాలీ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో రైతులకు అండగా నిలవాలి

**ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించి వారి మన్ననలు పొందాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతర్లపహాడ్ క్రాస్‌రోడ్డు సమీపంలో గుగులోతు జలేందర్ నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజునాథ ట్రేడర్స్ సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా నాయకులు మోరిశెట్టి లక్ష్మాది, మండల పార్టీ అధ్యక్షులు ముసుకు రామచంద్రారెడ్డితో కలిసి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి మాట్లాడారు. సమాజానికి వెన్నెముకగా నిలిచే రైతులకు మేలు జరిగేలా వారికి అవసరమైన విత్తనాలను నాణ్యతతో అందించాలని సూచించారు. పంట సాగులో పురుగుల మందుల కోసం రైతులు దుకాణానికి వచ్చినప్పుడు వారి పొలంలో ఉన్న పంట పరిస్థితి, తెగుళ్లు, పంట దశ తదితర అంశాలను పూర్తిగా తెలుసుకుని, అందుకు అనుగుణంగా నాణ్యమైన పురుగుల మందులను సూచించాలని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెన్నలపాండు నాయక్, దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుమూల సునీల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బాణోతు వాగ్య నాయక్, బాణోతు రవి నాయక్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# రిమ్స్ ప్రగతికి ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్,రాజముద్ర న్యూస్** : రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చడంతో పాటు నిర్వహణలో లోపాలను పూర్తిగా సరిదిద్దేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో అధికారులు, ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వేతనాల్లో అనధికారిక కోతలు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించిన విధులను వదిలి ఇతర పనులకు వెళ్లే సిబ్బందిని ఉపేక్షించబోమన్నారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు. రిమ్స్‌లోకి అనధికారిక ప్రవేశాలను అరికట్టేందుకు గతంలో అమల్లో ఉన్న పాస్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు, ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉండేలా గేటు వద్దే నియంత్రణ చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలో గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లాస్టిక్, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, సూపర్వైజర్లు తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రిమ్స్‌లో సాఫ్ట్వేర్ ఆధారంగా ఆన్లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రిజిస్టర్లో ఉన్న 420 మందిలో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మిగిలిన 70 మంది హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్లైన్ హాజరు వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ నుంచి ఆన్లైన్ హాజరు ఆధారంగానే వేతనాలు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11కోట్ల నిధులతో రిమ్స్‌లో లిఫ్టులు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వీల్చైర్లు, హెచ్డీఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్యార్డుకు తరలించేందుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను డిసెంబర్ 3లోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకు ముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్లో ఔట్సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్యలు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధన, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపహాడ్ లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం



**ఆత్మకూర్ (ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం). మండలం ఉప్పలపహాడ్ గ్రామం లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలతో. యువకులతో కలిసి గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప శ్రమదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్, voa, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## చెక్ డ్యాం నిర్మాణ స్థలం పరిశీలించిన సర్పంచ్ దయ్యాల మాధవి శ్రీనివాస్



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండల పరిధిలోని పారుపల్లి గ్రామంలో పాత బుంగ బావి వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి స్థలం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పారుపల్లి సర్పంచ్ దయ్యాల మాధవి శ్రీనివాస్, సారగండ్ల గూడెం సర్పంచ్ సారగండ్ల చలమయ్య, వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్** : రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో గురువారం రోజున గ్రామ సర్పంచ్ తాండ్ర మనీషా రామస్వామి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు, రైతులు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల రాజు, డైరెక్టర్ కామిల్ల లక్ష్మి , వివో లు బొమ్మిడి భూలక్ష్మి , గజ్జల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం

**సిడిపిఓ సుజాత**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం అన్నరం గ్రామంలో రైతు వేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసం నిర్వహించారు, సిడిపిఓ సుజాత మాట్లాడుతూ పిల్లలకు మొదటి 1000 రోజులకు రక్తహీనత, నివారణ , పౌష్టికాహారం విలువల గురించి అవగాహన కల్పించారు. అనంతరము గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, పి హెచ్ సి డాక్టర్ సురేష్, అన్నారం గ్రామ సర్పంచ్ లతా శ్రీనివాస్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమాదేవి, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గం వార్డు కార్యాలయాన్ని కొనసాగించాలి: గ్రామస్తుల వినతి



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్** : రాయదుర్గం లోని వార్డు కార్యాలయాన్ని ఇతర శాఖకు కేటాయించకుండా యథావిధిగా కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. 1977 నుండి గ్రామ పంచాయతీ కార్యాలయంగా సేవలందిస్తున్న ఈ భవనం జీహెచ్ఎంసీ విలీనం తర్వాత కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రంగా ఉందని, జనాభా పెరిగి 4 పోలింగ్ కేంద్రాలు 10కి పెరిగిన నేపథ్యంలో కార్యాలయం అవసరం మరింత పెరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దయాకర్ ముదిరాజ్, నీలం నరేందర్ ముదిరాజ్, సదాల నరేందర్ ముదిరాజ్, నరేందర్ యాదవ్, నీలం సురేందర్ కుమార్, కృష్ణ ముదిరాజ్, శివ గౌడ్, దుర్గా రామ్, వెంకటేష్, నాగపురి అశోక్ యాదవ్, పి. రాజు, పప్పి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నగర్ కాలనీలో గణేష్ లడ్డూ వేలం

## రూ.2,10,116 లకు కైవసం చేసుకున్న బలరాం యాదవ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శ్రీరామ్ నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కాలనీలోని గల్లీ గణేష్ వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాట భక్తులు, కాలనీ వాసుల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ వేలం పాటలో 21 కిలోల గణేష్ లడ్డూను రూ.2,10,116/- లకు సాయి హర్ష బిల్డర్స్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ కైవసం చేసుకున్నారు. వేలం పాటలో పలువురు భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొనగా పోటీ నెలకొంది. చివరకు అత్యధికంగా రూ.2,10,116లు పలికిన బలరాం యాదవ్ లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ.. గణనాథుడి లడ్డూ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్న బలరాం యాదవ్ కు నిర్వాహకులు, కాలనీ వాసులు అభినందనలు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఋషి పంచమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



**నేరడిగొండ(బజార్హత్నూర్)రాజముద్ర న్యూస్ :** బజార్హత్నూర్ మండలంలోని మంజీరమ్ తాండ గ్రామంలో మథుర సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఋషి పంచమి వేడుకల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. ప్రతి ఏడాది సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ మంజీరమ్ తాండలో ప్రతి సంవత్సరం మథుర సమాజ్ సభ్యులు ఐక్యతతో ఋషి పంచమి వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే జ్వాలాముఖి దేవి ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళంగా అందిస్తానని హామీ ఇచ్చారు. సాంప్రదాయాలు, ఆచారాలను కొనసాగిస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఋషి పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో జ్వాలాముఖి దేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ధ్రయవ్ సింగ్ మహారాజ్, తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మథుర సమాజ్ ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీచర పాఠశాలలో యూనిఫామ్, బెల్టుల పంపిణీ

**నేరడిగొండ,రాజముద్ర న్యూస్ :** మండలంలోని పీచర గ్రామంలో గల టిడబ్ల్యూ పిఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, బెల్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీచర గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ హాజరై విద్యార్థులకు యూనిఫామ్, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ చక్కగా చదువుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ శ్రేణుల జోష్

## సీఎం పాదయాత్రకు మైనారిటీ కార్యకర్తల భారీ మద్దతు

**గంభీరావుపేట,రాజముద్ర న్యూస్ :** సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు గంభీరావుపేట కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ హాష్మీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గంభీరావుపేట నుంచి పెద్ద సంఖ్యలో మైనారిటీ నాయకులు, కార్యకర్తలు సిరిసిల్లకు తరలివచ్చి సీఎం పాదయాత్రలో పాల్గొన్నారని తెలిపారు. కార్యకర్తల నినాదాలు, ఉత్సాహం, సమిష్టి భాగస్వామ్యంతో సిరిసిల్లలో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించిందన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో మైనారిటీ కార్యకర్తలు చూపించిన చొరవ, క్రమశిక్షణ, ఐక్యత అభినందనీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా ముందుకు సాగాలని కోరారు.

# గురువుల ఆశీస్సులతోనే ఉన్నత శిఖరాలకు

## మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్

**ఆదిలాబాద్,రాజముద్ర న్యూస్ :** గురువుల ఆశీస్సులతోనే తాను స్థాయికి చేరానని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే బాలికల కాలేజీలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించి, జీవితంలో మంచి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు తనకు లెక్చరర్గా ఉన్న ప్రిన్సిపాల్ కాలేజీకే తాను ముఖ్య అతిథిగా రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తన విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మనల్ని మంచి మార్గంలో నడిపించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలి

- ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**ఆదిలాబాద్:** భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్-2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు స్వీకరించేందుకు, పత్రాలు సమర్పించేందుకు కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలని సూచించారు. సాధారణంగా విచారణ కోసం కూడా ఓటర్లను కార్యాలయాలకు పిలవద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్లైన్ విధానాన్ని వినియోగించాలని తెలిపారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హత కలిగిన వ్యక్తులు 2023 అక్టోబర్ 31 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉంటే అర్హులవుతారని తెలిపారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణించాలని స్పష్టం చేశారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత నమోదు ప్రక్రియలో మరోసారి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు సమర్పించే మార్కుల మెమో జిరాక్స్ ప్రతిని గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సీ సెల్ నియామకాల్లో మాదిగలకు అన్యాయం



**తాండూర్:** కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించిన ఎస్సీ సెల్ జిల్లా, మండల అధ్యక్షుల నియామకాల్లో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని తాండూర్ మండల ఇన్చార్జ్ ఆయిల్ల గణేష్ ఆరోపించారు. ఈ నియామకాలను ఎమ్మార్పీఎస్ తరఫున ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో ప్రకటించిన ఎస్సీ సెల్ నియామకాలను రద్దు చేసి, వెంటనే నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీల్లోని మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తెలంగాణలో ఎస్సీ జనాభాలో మాదిగ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా ఉన్నప్పటికీ, ఎస్సీ సెల్ జిల్లా, మండల అధ్యక్షుల నియామకాల్లో తగిన ప్రాతినిధ్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. బుధవారం ప్రకటించిన జాబితాలో మాదిగ సామాజిక వర్గానికి ఎన్ని స్థానాలు కేటాయించారో కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత నియామకాలను వెంటనే రద్దు చేసి, అర్హులైన మాదిగ నాయకులకు సముచిత స్థానాలు కల్పించాలని తెలిపారు. ఈ నియామకాలు కక్షపూరితంగా, మాదిగలను అణిచివేసే విధంగా ఉన్నాయనే భావన కలుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ మాదిగలకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎమ్మార్పీఎస్ తరఫున న్యాయం కోసం పోరాడుతామని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలి

**హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ను రద్దు చేసి, తిరిగి స్థానిక పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ శ్రీహరి, ఉపసర్పంచ్ శంకర్ కోరారు. గురువారం జిల్లా విద్యాధికారి రోహిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుండ్ల మాచునూర్ యూపీఎస్లో ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు, సబ్జెక్టులకు అనుగుణంగా సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పేరుతో ఇతర ప్రాంతానికి పంపించడంతో విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులను తరచూ డిప్యూటేషన్పై ఇతర పాఠశాలలకు పంపిస్తే విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అజ్మత్ అలీ డిప్యూటేషన్ను వెంటనే రద్దు చేసి, గుండ్ల మాచునూర్ పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోష, రమేష్ తదితరులు ఉన్నారు.



# విద్యుత్ కష్టాలపై రోడ్డెక్కిన రైతన్నలు

- గంభీరావుపేట ప్రధాన రహదారిపై ధర్నా
- కాలిపోయిన మోటార్లతో నిరసన



**గంభీరావుపేట,రాజముద్ర న్యూస్ :** విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ గంభీరావుపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని తెలంగాణ స్థూపం వద్ద కాలిపోయిన వ్యవసాయ మోటార్లను రోడ్డుపై ఉంచి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మూడు గంటల పాటు కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా లోవోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విద్యుత్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని, మరోవైపు సరైన విద్యుత్ అందక పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి సాగుకు అవసరమైన స్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న గంభీరావుపేట ఎస్సై సిహెచ్.శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మారుతి రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్ కుమార్ ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మద్దుల రాజిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, బాబు, పొన్నాల మహేష్, మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్ యాదవ్, రైతులు గడ్డమీద ప్రసాద్ రెడ్డి, గంట అశోక్, కోడె రమేష్, దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, మహేష్ రెడ్డి, చిలుక ప్రశాంత్, లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిప్పల బాలయ్య, చిలుక స్వామి, దామోదర్ రెడ్డి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.





# టీ20ల్లో.. భారత జట్టు అరుదైన రికార్డు

ఆసియా క్రీడలు 2026లో భారత్ ఒక్క మ్యాచ్‌ను మాత్రమే ఆడింది. ఈ టోర్నీలో నేరుగా క్వార్టర్ ఫైనల్ బరిలోకి దిగినా.. వర్షం కారణంగా ఆ మ్యాచ్ జరగలేదు. ఇప్పుడు శ్రీలంకతో సెమీస్‌లో అద్భుత విజయం సాధించి టీమ్‌ఇండియా (Team India) ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో లంకపై 124 పరుగుల భారీ తేడాతో మన జట్టు గెలిచింది. ఈ క్రమంలోనే ప్రపంచ క్రికెట్‌లో శ్రేయస్ సేన అరుదైన రికార్డులను సృష్టించింది.

# భారత్‌కు పరాభవం..

ఏషియన్ గేమ్స్ 2026లో 12వ రోజు (అక్టోబర్ 1) భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వాలీబాల్, ఆర్చరీ, స్క్వాష్‌లో భారత అథ్లెట్లు నిరాశపరిచారు. సెపక్‌తక్రాలో మాత్రం భారత్‌కు పతకం ఖాయమైంది. పాకిస్తాన్ చేతిలో ఓటమిపురుషుల వాలీబాల్ క్వార్టర్‌ఫైనల్లో భారత్ పాకిస్తాన్ చేతిలో పరాజయంపాలైంది. 2025, 2729, 1525 వరుస సెట్లలో ఓడి 03తో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఈ పరాజయంతో భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించగా.. పాక్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆర్చరీలో నిరాశమహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ క్వార్టర్‌ఫైనల్లో భారత్‌కు చెందిన చికితా తనిపర్తి ఓటమి చవిచూసింది. ఇండోనేషియాకు చెందిన నురిసా దియాన్ అఫ్రిఫా చేతిలో 143144 తేడాతో ఓడిపోయింది. టీమ్ ఈవెంట్లలో ఇప్పటికే రెండు స్వర్ణ పతకాలు సాధించిన చికితా వ్యక్తిగత విభాగంలో ముందుకు వెళ్లలేకపోయింది. స్క్వాష్‌లో షాక్స్క్వాష్‌లోనూ భారత్‌కు షాక్ తగిలింది. మహిళల టీమ్ సెమీఫైనల్లో అనాహత్ సింగ్‌కు నిరాశ ఎదురైంది. హాంకాంగ్‌తో జరిగిన పోరులో ఆమె ఓటమి పాలైంది. దీంతో ఈ విభాగంలో భారత స్వర్ణ పతక ఆశలకు ఎదురుదెబ్బ తగిలింది. సెపక్‌తక్రాలో పతకం ఖాయంసెపక్‌తక్రాలో భారత్ చారిత్రాత్మక ప్రదర్శన చేసింది. పురుషుల క్వాడ్రంట్ గ్రూప్‌ఏ మ్యాచ్‌లో వియత్నాంపై భారత్ 20తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్ బెర్త్ ఖరారు కావడంతో భారత్‌కు ఈ విభాగంలో కనీసం ఒక పతకం ఖాయమైంది.



# ఇది క్రికెట్ కాదు.. ఓన్లీ బ్యాటింగ్

వెస్టిండీస్‌పై 400+ టార్గెట్‌ను ఛేదించిన భారత్ జట్టుపై (IND vs WI) సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ద్విశతకం, రోహిత్ శర్మ సెంచరీతో మన జట్టు అలవోకగా విజయం సాధించింది. అయితే, ఈ మ్యాచ్‌కు వినియోగించిన పిచ్‌పై టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ''ఈ మ్యాచ్ ఫలితం చూశాక.. బ్యాట్‌కు బంతికి మధ్య మరింత పోటీ ఉండాలని నాకు అనిపిస్తోంది. మనం క్రికెట్ గురించి మాట్లాడుతున్నాం. కానీ, ఇది అసలైన క్రికెట్ మ్యాచ్ కాదు. కేవలం బ్యాటింగ్ మాత్రమే. ప్రత్యర్థి జట్టు 400+ పరుగులు చేయడం, ఆ తర్వాత మనం ఆ లక్ష్యాన్ని ఛేదించడం.. రికార్డుల పరంగా, ప్రేక్షకులకు, బ్రాడ్ కాస్టర్లకు అద్భుతంగా అనిపించవచ్చు. కానీ ఒక నిజమైన క్రికెట్ అభిమానిగా, కోచ్‌గా మాత్రం నాకు అసంతృప్తిగానే ఉంది. బౌలర్లకూ అవకాశం ఉండాలని నేను చెబుతా. ఇదే పిచ్‌పై ఓ కుర్రాడు బౌలింగ్ చేస్తే అతడి మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో కూడా అర్థం చేసుకోవాలి'' అని గంభీర్ తెలిపాడు. బౌలర్ల పట్ల దయ చూపాలి.. ''కేవలం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను తయారు చేయడం సరికాదు. బౌలర్లపైనా కాస్త దయ చూపాలి. అయితే, ఇలాంటి పిచ్‌లపై బౌలింగ్ చేసినప్పుడు వారి గణాంకాల గురించి ఆందోళన పడనక్కర్లేదు. అకిబ్ నబీ తొలి మ్యాచ్ ఆడాడు. అతడికి మాత్రమే కాదు.. మిగతా బౌలర్లకూ ఈ మ్యాచ్‌లో కలిసిరాలేదు. వచ్చే మ్యాచ్‌లోనూ అకిబ్‌కు ఛాన్స్ ఇస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు. సిరీస్‌ల్లో గెలుపోటముల గురించి మేం ఒత్తిడికి గురవ్వట్లేదు. వరల్డ్ కప్‌లోనే బాగా ఒత్తిడి ఉంటుందని మాకు తెలుసు. నాలుగేళ్లకొకసారి వస్తుంది కాబట్టే అక్కడ అంత టెన్షన్. అంతేకానీ, క్రికెట్‌లో మరేది మారదు. గుర్నూర్ బ్రార్‌ను ఉదాహరణగా తీసుకుంటే.. అతడు తొలి పది ఓవర్లలో బౌలింగ్ వేశాడు. ఆ తర్వాత డెత్‌లోనూ సంధించాడు. అతడు చాలా కఠినమైన పరిస్థితుల్లో బౌలింగ్ చేశాడని గుర్తు పెట్టుకోవాలి'' అని గంభీర్ వెల్లడించాడు. ''వన్డే ప్రపంచ కప్ టోర్నీకి ఏడాది మాత్రమే సమయం ఉంది. అందులో మూడు నెలలు ఐపీఎల్ వెళ్లిపోతుంది. మరో మూడు నెలలు భారత్ - ఆస్ట్రేలియా సిరీస్ జరుగుతుంది. మహా అయితే మేం 20 వన్డేలను మాత్రమే ఆడతాం. అందులోనే మా బ్యాటర్లు, బౌలర్లను పరీక్షించాలి. మా ముందున్న ఆప్షన్లతోనే సన్నద్ధమవుతాం. ఐపీఎల్ తర్వాతనే మా మెయిన్ ప్రాబబుల్స్‌తో ఎక్కువగా ఆడిస్తాం.

# వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల..



దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న వన్డే ప్రపంచకప్2027 షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. ఈ మెగా టోర్నీ వచ్చే ఏడాది అక్టోబర్ 2న సూపర్ సిరీస్‌తో ప్రారంభమై నవంబర్ 21న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయి.

ఈ జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూపుఎలో అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, భారత్, పాకిస్తాన్, జింబాబ్వే, క్వాలిఫయర్‌ఎ ఉండగా.. గ్రూపుబిలో దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, క్వాలిఫయర్‌బి జట్లు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 7 కేప్‌టౌన్ వేదికగా ఆస్ట్రేలియాతో తలపడనుంది. అనంతరం అక్టోబర్ 10న జోహాన్స్‌బర్గ్ వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో టీమిండియా అమీతుమీ తెల్చుకోనుంది.




# ఆస్ట్రేలియా వన్డే విజయం..

సౌతాఫ్రికా పర్యటనలో ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియా పరువు కాపాడుకుంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో క్లీన్ స్వీప్ కాకుండా మర్యాద నిలుపుకుంది. ఈ సిరీస్‌లో తొలి రెండు వన్డేలు ఓడిన ఆ జట్టు, నిన్న జరిగిన నామమాత్రపు చివరి వన్డేలో గెలిచి 12తో సిరీస్‌ను ముగించింది. ఈ మ్యాచ్‌ను కూడా ఆసీస్ పూర్తిగా ఆడి గెలవలేదు. సౌతాఫ్రికా ఛేదన సమయంలో వర్షం అడ్డుపడటంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 45 పరుగుల తేడాతో విజయం సాధించింది.రాణించిన మార్ష్, క్యారీతొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా, కెప్టెన్ మిచెల్ మార్ష్ (56), అలెక్స్ క్యారీ (74) అర్ధ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. ట్రవిస్ హెడ్ 24, కూపర్ కన్నోల్లీ 23, ఒలివర్ పీక్ 48, రెన్షా 30, గ్రీన్ 23, బార్ట్‌లెట్ 2, కమిన్స్ 11, స్టార్క్ 11 (నాటౌట్) పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెట్లు పడగొట్టగా.. గెరాల్డ్ కొయెట్జీ, లిజాడ్ విలియమ్స్ తలో 2, ఫోర్టుయిన్ ఓ వికెట్ దక్కించుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 1454 స్కోర్ (28 ఓవర్లు) వద్ద ఉండగా భారీ వర్షం మొదలైంది. వరుణుడు ఎంతకీ శాంతించకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన అప్పటికి ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియాను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ నిలిచిపోయే సమయానికి ర్యాన్ రికెల్టన్ 71, కార్బిన్ బాష్ 13 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఔటైన బ్యాటర్లలో మార్క్రమ్ 15, డికాక్ 0, బ్రీట్జ్కే 25, స్టబ్స్ 14 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బార్ట్‌లెట్, జంపా తలో 2 వికెట్లు పడగొట్టారు. అక్టోబర్ 9 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభంసౌతాఫ్రికాఆస్ట్రేలియా మధ్య అక్టోబర్ 9 నుంచి మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి టెస్ట్ డర్బన్ వేదికగా, రెండో టెస్ట్ గ్వెబెర్హా వేదికగా అక్టోబర్ 18న, మూడో టెస్ట్ కేప్‌టౌన్ వేదికగా అక్టోబర్ 27న మొదలవుతాయి.






# గురి.. స్వర్ణాల ఝురి.. కాంపౌండ్ ఆర్చరీలో భారత్ హవా



ఆసియా క్రీడల ఆరంభంలో నిరాశపరిచిన భారత అథ్లెట్లు ఆలస్యంగా జోరందుకుంటున్నారు. మంగళవారం రెండు పసిడి పతకాలతో మెరిసిన భారత్.. బుధవారం ఏకంగా నాలుగు స్వర్ణాలను కొల్లగొట్టింది. ట్రాప్‌లో గోల్డ్‌తో చరిత్ర సృష్టించిన షూటర్ నీరూ దాండా మరోసారి మెరిసింది. హైదరాబాద్ షూటర్ కైనన్ చెనాయ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. కాంపౌండ్ ఆర్చరీ టీమ్ విభాగాన్ని భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. తెలుగమ్మాయి చికిత తానిపర్తి డబుల్ సాధించింది. మరో తెలుగమ్మాయి జ్యోతిసురేఖ, ప్రీతికతో కలిసి మహిళల టీమ్ ఈవెంట్లో విజేతగా నిలిచిన ఆమె.. సాహిల్‌తో కలిసి మిక్స్‌డ్ స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. పురుషుల టీమ్ ఈవెంట్లోనూ బంగారు పతకం భారత్‌దే. అబ్బాయిల జట్టులో తెలుగు కుర్రాడు గణేశ్ మణిరత్నం ఉన్నాడు. 10 స్వర్ణాలు సహా 60 పతకాలతో భారత్.. పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానానికి ఎగబాకింది. ఆసియా క్రీడల్లో బుధవారం భారత్‌కు పసిడి పంట పండింది. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ కాంపౌండ్ ఆర్చర్లు దేశానికి మూడు పసిడి పతకాలను అందించారు. టీమ్ విభాగంలో అన్ని స్వర్ణాలనూ మన ఆర్చర్లే సాధించడం విశేషం. జ్యోతి సురేఖ, చికిత, ప్రీతిక ప్రదీప్‌లతో కూడిన భారత జట్టు హోరాహోరీగా సాగిన మహిళల టీమ్ ఈవెంట్ ఫైనల్లో 238234తో చైనా త్రయం వునియర్, యూ వాంగ్, ఫంగ్యావ్ వీలపై విజయం సాధించింది. ఫైనల్లో జ్యోతి సురేఖ, ప్రీతిక తమ ఎనిమిది బాణాలకూ 10లు కొట్టారు. భారత త్రయం తమ స్కోరు (238)తో కొరియా జట్టు పేరిట ఉన్న ప్రపంచ రికార్డును సమం చేసింది. అంతకుముందు సెమీఫైనల్లో ఈ జట్టు 234233తో దక్షిణ కొరియా జట్టును ఓడించింది. ఇక పురుషుల టీమ్ ఈవెంట్లో కుశాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నంలతో కూడిన జట్టు విజేతగా నిలిచింది. రసవత్తరంగా సాగిన ఫైనల్లో ఆ త్రయం 238 237తో చైనా జట్టును ఓడించింది. భారత జట్టు చివరి 18 బాణాలకు అందుబాటులో ఉన్న 180 స్కోరునూ సాధించడం విశేషం. సూపర్ ఫామ్‌ను ప్రదర్శించిన సాహిల్.. ఫైనల్లో తన ఎనిమిది బాణాల్లో ప్రతిదానికీ 10 కొట్టాడు. అంతకుముందు సెమీస్‌లో భారత్ 236229తో దక్షిణ కొరియా బృందాన్ని ఓడించింది. మరోవైపు చికిత, సాహిల్ జోడీ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణాన్ని హస్తగతం చేసుకుంది. ఫైనల్లో ఈ ద్వయం దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జుంగ్యాన్, చోయ్ యోంగి జంటపై విజయం సాధించింది. రెండు జట్లు 157157తో సమంగా నిలవడంతో షూటాఫ్ అనివార్యమైంది. షూటాఫ్‌లో భారత జంట పైచేయి సాధించింది. సాహిల్, చికిత స్వర్ణాల డబుల్ సాధించారు. ఈ జంట విజయంతో భారత్‌కు 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఆర్చరీ కోటా స్థానం కూడా దక్కింది. కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్లో వచ్చే ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి దేశంగా భారత్ నిలిచింది. గత ఆసియా క్రీడల్లోనూ కాంపౌండ్ టీమ్ విభాగాన్ని భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.

## పాక్‌ను చిత్తు చేసి ఫైనల్‌కు

# భారత హాకీ జట్టు

ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో నిన్న దక్షిణ కొరియాపై గెలిచి భారత్ స్వర్ణ పోరుకు సిద్ధమైంది. తాజాగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అప్రతిహత విజయంతో భారత పురుషుల జట్టు కూడా ఫైనల్‌లో అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన సెమీస్‌లో భారత్ 43 తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

తొలి అర్ధ భాగంలో భారత్ 31తో ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే, సెకండ్ హాఫ్‌లో పాకిస్థాన్ బలంగా పుంజుకొని స్కోర్లను సమం చేసింది. ఆఖరి నిమిషంలో అభిషేక్ అద్భుతమైన గోల్‌తో భారత్‌ను 'గోల్డ్ మెడల్' పోరులో అడుగు పెట్టేలా చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత (Team India) క్రీడాకారులు హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్.. సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్ చెరో గోల్ చేశారు. గత పదేళ్ల వ్యవధిలో పాక్‌పై భారత్ ఇప్పటివరకు వరుసగా 21 మ్యాచ్‌ల్లో గెలవడం విశేషం.

ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకు ఆసియా గేమ్స్ ఒకే ఎడిషన్‌లో (Asian Games) పురుషుల, మహిళల హాకీ జట్లు బంగారు పతకాలను నెగ్గలేదు. ఈసారి ఆ అవకాశం మన ఆటగాళ్లకు వచ్చింది. అలాగే గోల్డ్ గెలిస్తే.. రాబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో నేరుగా అర్హత సాధించే అవకాశం లభిస్తుంది. మలేసియా/కొరియా మ్యాచ్ విజేతతో శనివారం భారత పురుషుల జట్టు ఫైనల్‌లో తలపడనుంది. ఇక మహిళా టీమ్ శుక్రవారం చైనాతో స్వర్ణం కోసం పోటీపడనుంది.

**రెజ్లింగ్‌లో రజతం.. ఆర్చరీలో కాంస్యం**

భారత రెజ్లర్ నితీశ్ సివాచ్ 97 కేజీల గ్రీకో రోమన్ స్టైల్‌లో రజతం సొంతం చేసుకున్నాడు. ఫైనల్‌లో జపాన్ రెజ్లర్ యురి నకజటో 40 తేడాతో నితీశ్‌ను ఓడించాడు. ఆసియా క్రీడల్లో గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో రజతం సాధించిన తొలి భారత రెజ్లర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇక ఆర్చరీలో భారత్‌కు కాంస్య పతకం దక్కింది. కాంపౌండ్ మెన్స్ వ్యక్తిగత విభాగంలో గణేశ్ మణిరత్నం 149 144 తేడాతో వియత్నాంకు చెందిన కాంగోపై విజయం సాధించాడు. దీంతో ఆర్చరీ విభాగంలో భారత్ మూడు స్వర్ణాలు, ఒక కాంస్యంతో తన క్యాంపెయిన్‌ను ముగించింది. సెయిలింగ్ మెన్స్ స్కిఫ్ విభాగంలో భారత ద్వయం మను ఫ్రాన్సిస్ ప్రిన్స్ కురిసింకల్ నోబుల్ రెండోస్థానం సాధించి రజతం దక్కించుకున్నారు. ఈ పోటీల్లో చైనా స్వర్ణం నెగ్గగా.. హాంకాంగ్ కాంస్య పతకం అందుకొంది. ఇక, పురుషుల స్క్వాష్ సెమీస్‌లో మలేషియా చేతిలో భారత బృందం ఓటమిపాలైంది. దీంతో కాంస్యంతో సరిపెట్టుకుంది. మరోవైపు క్రికెట్‌లో శ్రేయస్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా ఇప్పటికే ఫైనల్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్ 64 పతకాలతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇందులో 10 స్వర్ణాలు, 22 రజతాలు, 32 కాంస్యాలు ఉన్నాయి.



# ఐదేళ్ల ప్రేమకు హృతిక్ 'స్పెషల్ పోస్ట్'

## సబాతో బంధానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫొటోలు పంచుకున్న బాలీవుడ్ స్టార్

## హృతిక్-సబా అనుబంధంపై మరోసారి అభిమానుల్లో ఆసక్తి

**ముంబై, అక్టోబర్ 1 :** బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, నటి–గాయని సబా ఆజాద్ తమ అనుబంధంలో ఐదేళ్ల మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భంగా సబాతో కలిసి గడిపిన మధుర క్షణాలకు సంబంధించిన ఫొటోలను హృతిక్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సరదా సెల్ఫీల నుంచి విహారయాత్రల వరకు తమ ప్రయాణంలోని ప్రత్యేక జ్ఞాపకాలను అభిమానులతో పంచుకోవడంతో ఈ పోస్టు వైరల్‌గా మారింది. ఫొటోల్లో హృతిక్, సబా సరదాగా సెల్ఫీలు దిగుతూ కనిపించగా.. సముద్రతీరంలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలు, రెస్టారెంట్‌లో చేతులు పట్టుకుని కూర్చున్న క్షణాలు, విమాన ప్రయాణంలో ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అయితే హృతిక్ పోస్టుకంటే ఆయన మాజీ భార్య సుసాన్ ఖాన్ స్పందన మరింతగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. "చాలా స్వీట్.. హ్యాపీ యానివర్సరీ" అంటూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆమె కామెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హృతిక్, సుసాన్ 2000లో వివాహం చేసుకోగా.. 2014లో విడాకులు తీసుకున్నారు. విడిపోయిన తర్వాత కూడా పిల్లల విషయంలో పరస్పర సహకారంతో కొనసాగుతున్నట్లు వారు గతంలో పలు సందర్భాల్లో బహిరంగంగా కనిపించారు. హృతిక్, సబా కొన్నేళ్ళుగా కలిసి కనిపిస్తూ తమ అనుబంధాన్ని బహిరంగంగానే కొనసాగిస్తున్నారు. హృతిక్ చివరిగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలోని 'వార్ 2'లో నటించారు. ఇందులో జూనియర్ ఎన్టీఆర్, కియారా అద్వానీ కీలక పాత్రలు పోషించారు. 'క్రిష్ 4'తో హృతిక్ దర్శకుడిగా అరంగేట్రం చేయనున్నట్లు 2025లో రాకేశ్ రోషన్ అధికారికంగా ప్రకటించారు. మీ కాపీలో ఉన్న 'క్రిష్ 3' స్థానంలో 'క్రిష్ 4' అని ఉండాలి. మరోవైపు సబా ఆజాద్ నటనతోపాటు సంగీత రంగంలోనూ కొనసాగుతున్నారు. ఆమె నటించిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'తోపాటు ఇతర ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకొచ్చాయి.



# 'జైలర్ 2'లో నోరా గ్లామర్ ధమాకా!

**చెన్నై, అక్టోబర్ 1 :** రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న 'జైలర్ 2'లో గ్లామర్ హంగులు మరింత పెరగనున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీతో ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించినట్లు సమాచారం. తెలుగు, హిందీ చిత్రాల్లో తన డ్యాన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా.. ఈ పాటతో తమిళ ప్రేక్షకులనూ ఆకట్టుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలుగులో 'టెంపర్'లోని 'ఇట్టాగే రెచ్చిపోదాం' పాట నోరాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత 'బాహుబలి', 'కిక్ 2', 'లోఫర్' తదితర చిత్రాల్లో ప్రత్యేక గీతాలతో సందడి చేసింది. హిందీలోనూ పలు హిట్ పాటలతో డ్యాన్సర్‌గా ప్రత్యేక క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల వరుణ్ తేజ్ 'మట్కా'లోనూ కీలక పాత్రలో కనిపించింది. తొలి 'జైలర్'లో తమన్నా చేసిన 'కావాలయ్యా' పాట సినిమా విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అలాంటి కమర్షియల్ ఆకర్షణ కలిగించే పాట ఉండాలనే ఉద్దేశంతో నోరాను రంగంలోకి దించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నటి పూర్ణతో ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించినట్లు సమాచారం ఉండగా, దానికి సంప్రదాయ శైలి ఎక్కువగా ఉండటంతో మరో గ్లామరస్ నంబర్‌ను నోరాతో రూపొందించినట్లు సినీవర్గాల కథనం. కొంతకాలంగా నోరా ప్రత్యేక గీతాల సంఖ్య తగ్గిన నేపథ్యంలో 'జైలర్ 2' ఆమెకు కీలక ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంది. డ్యాన్స్, గ్లామర్‌తో తనకున్న ప్రత్యేకతను ఈ పాటలో మరోసారి చూపించినట్లు సమాచారం. అయితే పాటకు సంబంధించిన పూర్తి వివరాలు, విడుదల తేదీపై చిత్రబృందం నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.









# కొత్త కోడలా.. ఇంట్లో దెయ్యమా?

## యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల

## నవ్విస్తూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హారర్-కామెడీ

**ముంబై, అక్టోబర్ 1 :** ఇంట్లోకి కొత్త కోడలు వచ్చింది.. ఆమె అడుగుపెట్టగానే అప్పటివరకు గందరగోళంగా ఉన్న కుటుంబంలో ప్రశాంతత నెలకొంది. అంతా ఆమెను అదృష్టంగా భావిస్తుంటే.. ఒక్కరికి మాత్రం అనుమానం! కనిపిస్తున్నంత అమాయకురాలేనా?.. లేక ఆ నవ్వు వెనుక ఎవరికీ తెలియని భయంకరమైన రహస్యం ఉందా?.. ఈ ప్రశ్నలతో ఆసక్తి రేకెత్తిస్తోంది యామి గౌతమ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'నైయ్ నవెల్లి' ట్రైలర్. బాలాజీ మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్–కామెడీ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగనుంది. యామి గౌతమ్‌తోపాటు ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఓ సాధారణ కుటుంబంలోకి యామి కొత్త కోడలిగా అడుగుపెడుతుంది. అప్పటివరకు అస్తవ్యస్తంగా సాగుతున్న ఆ కుటుంబ జీవితాలు ఆమె రాకతో ఒక్కసారిగా గాడిలో పడతాయి. ఇంట్లో అందరూ ఆమెను అభిమానిస్తుండగా.. ఆదినాథ్ పోషిస్తున్న మరిది పాత్రకు మాత్రం ఆమె ప్రవర్తనపై అనుమానం మొదలవుతుంది. అక్కడి నుంచే కథ హారర్ మలుపు తీసుకుంటుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కొత్త కోడలు నిజంగానే కుటుంబానికి అదృష్టాన్ని తీసుకొచ్చిందా?.. లేక ఆమె వెనుక ఏదైనా అతీంద్రియ శక్తి, అంతుచిక్కని రహస్యం దాగి ఉందా? అనే ఉత్కంఠను ట్రైలర్ కొనసాగించింది. ఓవైపు కుటుంబ సభ్యుల మధ్య సన్నివేశాలతో నవ్వులు పంచుతూనే.. మరోవైపు భయపెట్టే దృశ్యాలతో ఆసక్తిని పెంచే ప్రయత్నం చేశారు. హారర్, కామెడీ అంశాలను మేళవిస్తూ కుటుంబ కథకు మిస్టరీని జోడించడం 'నైయ్ నవెల్లి' ప్రత్యేకతగా కనిపిస్తోంది. ముఖ్యంగా యామి పాత్ర చుట్టూ అసలు రహస్యాన్ని బయటపెట్టకుండా ట్రైలర్‌ను కట్ చేయడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దసరా సందర్భంగా అక్టోబర్ 16న చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# 'కన్య' కాదని పెళ్లి రద్దు..

## అదే 'ఇంప్యూర్' కథ!

**హైదరాబాద్, అక్టోబర్ 1 :** పెళ్లి పీటలు సిద్ధమయ్యాయి.. రెండు కుటుంబాలు కొత్త బంధానికి సిద్ధమయ్యాయి. అంతలో పెళ్లికూతురు 'కన్య' కాదనే విషయం అత్తింటివారికి తెలుస్తుంది. అంతే.. పెళ్లి రద్దవుతుంది! అక్కడి నుంచి ఆ యువతి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది?.. ఆమె గతాన్ని ప్రశ్నించే సమాజానికి ఆమె సమాధానం ఏమిటి?.. ఇలాంటి సున్నితమైన అంశాన్ని కథావస్తువుగా తీసుకుని తెరకెక్కిన చిత్రమే 'ఇంప్యూర్'. కాకినాడలో జన్మించి అమెరికాలో పెరిగిన వారాహి మల్లిపాముల ఈ చిత్రంతో నటిగా, రచయిత్రిగా, నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌లో సాంకేతిక రంగంలో పనిచేస్తూనే రాత్రిళ్లు, వారాంతాల్లో కథపై పనిచేసినట్లు వారాహి తెలిపారు. మహిళ జీవితాన్ని ఆమె లైంగిక గతం ఆధారంగా కొలిచే సామాజిక దృక్పథాన్ని ప్రశ్నించే ప్రయత్నమే ఈ సినిమా కథలో ప్రధానంగా కనిపిస్తోంది. మహిళా ప్రాధాన్య కథతో సినిమా నిర్మించేందుకు పలువురు నిర్మాతలను సంప్రదించినా ఆశించిన స్పందన రాలేదని వారాహి చెప్పారు. దీంతో చివరకు తానే నిర్మాతగా మారాల్సి వచ్చిందన్నారు. తన సినిమా కల కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాన్ని చూసిన తల్లి అండగా నిలిచిన తీరు గురించి వారాహి భావోద్వేగంగా వివరించారు. "మా చెల్లి పెళ్లికి ఖర్చు చేసినట్లే నీకూ డబ్బులు ఇస్తాను.. వాటిని నీ సినిమా కోసం పెట్టుకో అని అమ్మ చెప్పింది. అయితే ఆ మొత్తం కూడా సరిపోలేదు. అప్పులు చేయాల్సి వచ్చింది. అమెరికా నుంచి ఇక్కడికి వచ్చి నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి సినిమాను పూర్తి చేశాం" అని ఆమె పేర్కొన్నారు. పెళ్లికి ముందు మహిళ వ్యక్తిగత జీవితాన్ని 'పవిత్రత' అనే కొలమానంతో చూడటం, అదే ప్రమాణాన్ని పురుషులకు వర్తింపజేయకపోవడం వంటి ప్రశ్నలను సినిమా ఏ కోణంలో చర్చిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బోల్డ్ కథాంశంతో వస్తున్న 'ఇంప్యూర్' ప్రేక్షకుల్లో ఎలాంటి చర్చకు దారితీస్తుందో చూడాలి.





Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com